క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సంతబొమ్మాళి: మండలంలోని బడేకుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ సభ్యులు ఇబ్బందుల్లో ఉన్న పలువురుకి సోమవారం ఆర్థిక సహాయం చేశారు. మలగాం పంచాయతీ సూరాడవానిపేటకు చెందిన పక్షవాతం రోగి చెక్క కామమ్మ, టింకూరు గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి గుర్రు మధన్‌కుమార్‌లకు మందుల కోసం రూ. 5 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు షణ్ముఖరావు, భూషణరెడ్డి, శివారెడ్డి ఉన్నారు.

ఆస్తిపన్ను వసూలుపై సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సర్వేలు, ఆస్తి పన్ను వసూళ్లపై కమిషనర్ నడిపేన రామారావు సిబ్బందితో సోమవారం సమీక్షించారు. పన్నుల వసూళ్లపై శ్రద్ధకనబర్చాలని సూచించారు. సమావేశంలో 31 వార్డుల పరిధిలోని 16 సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు షీల్డు, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ బయోలజీ టీచర్స్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళంలో నిర్వహించిన మండల స్థాయి బయోలజీ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఈదుపురం కంచ్రావార్డు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి రెండవ స్థానంలో నిలిచారు. ఒరియా మాధ్యమంలో నిర్వహించిన పోటీల్లో అశ్విని బెహరా, హరిప్రియ బెహరా, అంజలి బెహరాను ప్రధానోపాధ్యాయుడు బి.రామారావు, బయాలజీ ఉపాధ్యాయుడు భాస్కర్ పాడీ, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో అభినందించారు.

విద్యార్థులకు దుస్తులు వితరణ



దుస్తులు అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

కాశీబుగ్గ: సిక్కోలు ఉద్దాన సేవాసమితి ఆధ్వర్యంలో మందస మండలం గిరిజన ప్రాంతమైన చిన్నకోష్టలోని జీటీడబ్ల్యుఏజీహెచ్ స్కూల్, హాస్టల్లో ఉంటున్న 238 మంది పిల్లలకు దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం కిడ్నీ మహమ్మారిపై చిన్నారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తారక్, రాజేష్, మహేష్, ఢిల్లీ గోవిందా, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుర్చీలు వితరణ



కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: సీతానగరం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బొడ్డేపల్లి పాపారావు పది కుర్చీలను పాఠశాలకు వితరణగా సోమవారం అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కిశోర్, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్.బాబ్జీ పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..!

- కానరాని కల్వర్టులు
- పట్టించుకోని కౌన్సిల్ సభ్యులు



పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రోడ్డు పక్కన ప్రమాదకర పరిస్థితి

కాశీబుగ్గ:

రాష్ట్రంలో ఉన్న గ్రేడ్–2 మున్సిపాలిటీల్లో పలాస–కాశీబుగ్గ ఒకటి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇక్కడ అభివృద్ధి పడకేసిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా రోడ్ల పక్కన కల్వర్టుల ఏర్పాటుపై అధికారులు, కౌన్సిల్ సభ్యులు దృష్టిసారించడం లేదు. ఫలితంగా ఎవరైనా ఆదమరిచి వెళ్తే మురుగు కాలువల్లో పడిపోయి ప్రాణాలు పోగొట్టుకోవడం, క్షతగాత్రులుగా మారడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపాలిటీలో కొత్తగా రోడ్లు నిర్మించడం, పాత రోడ్లకు మరమ్మతులు జరిపినప్పటికీ వాటికి అనుసంధానంగా కల్వర్టుల ఏర్పాటు, కాలువలు సరైన పద్ధతిలో నిర్మించకుండానే వదిలేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల పరిధిలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై కల్వర్టులు లేకపోవడం, కాలువలపై నాణ్యతతో కూడిన సిమెంట్ పలకలు వేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలాస కేటీ రోడ్డులో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రోడ్డు పక్కన కొద్దినెలల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు కోరుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఇద్దరు వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు. పలాస విద్యుత్ కార్యాలయం, మోర్, లేబరుకాలనీ ప్రారంభంలో సైతం రోడ్డు పక్కన కల్వర్టు, పలకల్లేక ప్రమాదకరంగా మారింది. పాత జాతీయ రహదారి–ఒడియా పాఠశాల మధ్యలో ఉన్న కల్వర్టు వర్షాలకు పాడైపోయి ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. ఉదయపురం నుంచి సీతమ్మతల్లి ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఎటువంటి ఆధారం లేక ప్రయాణాలు సాగిస్తున్నారు. మలుపుల వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉన్నాయి. పలాస నుంచి కాశీబుగ్గ కేటీరోడ్డులో ఉన్నటువంటి నాలుగు లైన్ల రహదారి మధ్యలో డివైడర్‌లు తొలగించేయడంతో వాహనాలు మధ్యలో రాకపోకలు సాగిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయంగా మారింది. అన్నపూర్ణ సినిమా థియేటర్, శ్రీనివాస కూడలి, మూడు రోడ్ల జంక్షన్, మసీదు, డిగ్రీ కళాశాల రోడ్డు, పలాస ఎస్‌బీఐ ప్రాంతంలోని రోడ్లకు కల్వర్టుల్లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా మేల్కొని అవసరమైనచోట్ల కల్వర్టులను నిర్మించి ప్రమాదాలను నివారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



న్యూకాలనీలో మమత ఆస్పత్రి వద్ద శిథిలమైన పలకలు



కాశీబుగ్గ పాతజాతీయ రహదారి–ఒడియా పాఠశాల మధ్య దుస్థితి

సమస్యను పరిష్కరిస్తాం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల ప్రమాదకర పరిస్థితులు ఉన్నమాట వాస్తవమే. దీన్ని తాము గుర్తించాం. ఈ విషయాన్ని పలాస ఎమ్మెల్యే దృష్టిలో పెట్టి సమీక్షా సమావేశం నిర్వహిస్తాం. కౌన్సిల్ సమావేశంలో చర్చించి ప్రత్యేక నిధులను కేటాయించి కల్వర్టుల నిర్మాణం, మరమ్మతులు చేపడతాం. అత్యవసర పనులలో పెట్టి పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడతాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

అత్యవసర సమావేశం వివాదాస్పదం!

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాలక మండలి సమావేశం వివాదాస్పదంగా మారింది. పంచాయతీ పరిధిలో పలు కార్యక్రమాలకు సంబంధించి తీర్మానంతో పాటు సభ్యుల ఆమోదం కోసం కార్యదర్శి జగన్నాథం సమావేశం నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తమకు తెలియకుండా తమ వార్డుల్లో పరిధిలో కొంతమంది టీడీపీ కార్యకర్తలు వివిధ రకాల పనులు ఎలా చేస్తారని సభ్యులు నిలదీశారు. తమకు తెలియకుండా చేసిన పనులకు ఎటువంటి తీర్మానం, ఆమోదం ఇచ్చేది లేదంటూ తెగేసి చెప్పేశారు. ఇదిలా ఉండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొంతమంది సభ్యులకు మాత్రమే సమాచారం ఇస్తూ సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ వార్డు సభ్యుడు ధర్మారావు నిలదీశారు. దీంతో ఎటువంటి అంశాలు ప్రస్తావన లేకుండా సమావేశం అర్థాంతరంగా ముగిసిపోయింది.

దర్జాగా ఆక్రమణ!



భవానీనగర్‌లో రోడ్డుకు ఆనుకుని ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని భవానీనగర్ కాటాబందలో ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది దర్జాగా ఆక్రమించి నిర్మాణాలు చేసేస్తున్నారు. దీన్ని నివారించాల్సిన రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తుండడంపై స్థానికులు నివ్వెరపోతున్నారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించకపోవడంపై స్థానికులు కొంత మంది మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కాటాబందలో భవానీనగర్ మీదుగా జాతీయ రహదారి వరకు విశాలమైన రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఇదే అదునుగా రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమిస్తూ గుట్టు చప్పుడు కాకుండా శరవేగంగా నిర్మాణాలు చేస్తున్నారు. సామాన్యులకే రెవెన్యూ చట్టాలు వర్తిస్తాయా.. ఇటువంటి అక్రమ నిర్మాణాలకు వర్తించవా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సారించకపోతే కాటాబందలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఇంకెన్ని కబ్జాకు గురవుతాయోనని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

పరీక్ష పే చర్చను వీక్షించిన విద్యార్థులు



కవిటి: నరేంద్రమోదీ సందేశాన్ని వింటున్న రాజపురం బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు



కంచిలి: పరీక్ష పే చర్చను టీవీలో వీక్షిస్తున్న బూరగాం ఉన్నత పాఠశాల విద్యార్థులు

కంచిలి: పరీక్ష పే చర్చలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని విద్యార్థులు ఉత్సాహంగా తిలకించారు. సోమవారం ప్రసారమైన టెలివిజన్ కార్యక్రమాన్ని బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వీక్షించారు. ప్రధానమంత్రి సందేశంలో ఏకాగ్రతతో దృష్టి కేంద్రీకరించి చదవాలని, క్రికెట్ ఆటలో బ్యాట్స్‌మన్ బాల్‌పై గురిపెట్టి ఏకాగ్రతతో ఆడినట్లు బయట నుంచి ఎన్ని ధ్వనులు ప్రతిధ్వనులు ప్రెజర్ ఉన్నా విద్యార్థి మాత్రం చదువుపై ఏకాగ్రత సాధించాలని ఉదహరించారు. రుచికర పదార్థాలను, అందచందాలను ఏ విధంగా ఆస్వాదిస్తున్నామో చదువు పట్ల కూడా విద్యార్థులు ఆసక్తి కలిగి ఉండాలని, బాధ్యతతో ప్రవర్తించాలని తెలియజేశారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: రాజపురం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్ష పే చర్చలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని తిలకించారు. హెచ్ఎం శివరాంప్రసాద్ పాఢి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో మంచి ఆరోగ్యం

నులిపురుగుల నివారణతో మంచి ఆరోగ్యం సాధ్యమని వైద్యాధికారులు, వక్తలు అన్నారు. వీటి నివారణకు క్రమం తప్పకుండా మందులను వేసుకోవాలని సూచించారు. నులిపురుగుల నివారణ చర్యల్లో భాగంగా అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులు, పిల్లలకు సోమవారం పంపిణీ చేసి మింగించారు. ఈ మాత్రలను వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: 'స్టాప్ నులిపురుగు' ఆకృతిని ప్రదర్శిస్తున్న కొళిగాం ఉన్నత పాఠశాల విద్యార్థులు



నందిగాం: నౌగాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది



కంచిలి: జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో వి.తిరుమలరావు



కవిటి: ప్రభుత్వ పాఠశాలలో నులి పురుగుల నివారణ శిబిరంలో ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి



ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీవార్మింగ్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ఎం ఎస్.విశ్వనాథం



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



వజ్రపుకొత్తూరు: ఎస్‌జేపురంలో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేస్తున్న గోవిందపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు

మందస వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా జానకిరెడ్డి



జానకిరెడ్డిని అభినందిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు

కాశీబుగ్గ: మందస మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా సీనియర్ నాయకులు దల్లి జానకిరెడ్డి నియమితులయ్యారు. పలాసలోని పార్టీ కార్యాలయంలో మందస నాయకుల సమావేశం సోమవారం జరిగింది. మాజీ మండల అధ్యక్షులు అగ్గున్న సూర్యరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్యవర్గం, నాయకులంతా కలిసి జానకిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకి, పార్టీ శ్రేణులకు జానికిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జిల్లా సెక్రటరీ బత్తిన హేమేశ్వరరావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మహిళా ప్రతినిధి బల్ల లీలాకుమారి, మాజీ ఎంపీపీ సవర కామేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అందాల శేషగిరి, మందస సర్పంచులు సంఘం అధ్యక్షులు సురేష్ పాణిగ్రాహి, వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు సభ్యుడు బత్తిని లక్ష్మణ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు నూతన అధ్యక్షుడుని అభినందించారు.

మానసిక ప్రశాంతత అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: విద్యాపరంగా ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థులు మానసిక ప్రశాంతతతో ఉండాలని, క్షణికావేశాలకు పోతే అనర్థాలకు దారితీస్తాయని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. ధర్మపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సోమవారం నిర్వహించిన సంకల్పం అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, ఒత్తిడికి గురుకాకుండా ప్రణాళిక బద్ధంగా చదవాలని, సెల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. సదస్సులో ఎంఈవో–2 ఎస్.విశ్వనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కార్మికులకు బీమా సౌకర్యం

సంతబొమ్మాళి: నౌపడ గ్రామానికి చెందిన సుమారు వందమంది కార్మికులకు నారీమణి ట్రస్ట్ ఫౌండర్ చెన్నూరు దుర్గారావు బాబ్జీ కార్మిక బీమాను చేయించి ఔదర్యాన్ని చాటుకున్నారు. టెక్కలి లేబర్ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రాధాకుమారి తన సిబ్బందితో వచ్చి కార్మికుల నుంచి సంబంధిత ప్రతాలను తీసుకొని బీమా పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఐదు సంవత్సరాలు బీమా వర్తించనుండగా.. ఒక్కో కార్మికుడు పేరున 110రూపాయల చొప్పున్న బ్యాంకులో చలానా తీసి సంబంధిత అధికారులకు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు సీహెచ్ లక్ష్మి ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం కన్నేవలస గ్రామంలోని కొత్తమ్మతల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అలయ ధర్మకర్త కాళ్ల గణపతిరావు దంపతులు తొలిపూజ చేశారు. పురోహితులు త్రినాథ్‌పండా, సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో అమ్మవారికి కుంకుమపూజలు, ముగ్గురాటలతో తిరువీధులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

మందస: పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సొండిపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పరీక్షలను ప్రధానోపాధ్యాయులు బి.ఎన్.సల్మాన్ పర్యవేక్షించారు. పబ్లిక్ పరీక్షలు పద్ధతిలోనే నామినల్ రోల్స్, బుక్లెట్స్ ఇచ్చి పరీక్ష నిర్వహించారు. మెడికల్ సిబ్బంది యశోద, లక్ష్మి, కాంతమ్మ, సచివాలయ పోలీసు మమత హాజరయ్యారు. 25 మంది పిల్లలు పరీక్షను రాశారు.

ప్రత్యేక గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

టెక్కలి రూరల్: రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని కోటబొమ్మాళి మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి గుర్తింపు పేర్లను నమోదు చేయించుకుంటే నమోదు చేసుకుంటే 11అంకెలతో కూడిన ప్రత్యేక నంబర్‌ను కేటాయిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల వర్తింపు కోసం ఈ నంబర్ రైతులకు ఉపయోగపడుతోందన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

సంతబొమ్మాళి: ఆర్.హెచ్.పురం గ్రామంలోని షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కుంకుమ పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎన్ని మన్మథరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సోంపేట: జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీల్లో సోంపేట మండలం బేసిరామచంద్రాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరిని పాఠశాల ఆవరణలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. పదో తరగతి విద్యార్థిని శాసనపురి శైలజ షాట్ ఫుట్, డిస్కస్ త్రో విభాగాల్లో జిల్లా ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది.

1500 మీటర్ల పరుగు పందెంలో తొమ్మిది తరగతి విద్యార్థి సుబుద్ధి శ్రీకాంత్ నాలుగో స్థానంలో నిలిచారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పీడీ పి.పద్మావతిని అభినందించారు.

ఆశలపూత..



పుటియాదళలో ఆశాజనకంగా మామిడి పూత



కపాసుకుద్ధిలో పూతదశలో జీడి

జీడి, మామిడి పూత ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది ఉద్యానపంటలు కలిసివస్తాయని ఉద్దానం రైతులు ఆశిస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే పువ్వు పిందెగా.. కాయగా..పిక్కగా మారితే తమకు నాలుగు పైసలు కలిసివస్తాయని భావిస్తున్నారు. అయితే ఇటీవల దట్టంగా కురుస్తున్న పొగమంచుతో పువ్వుమాడిపోయే అవకాశం ఉందని భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సహకరించి జీడి, మామిడిపంట కలిసి రావాలని ఆశిద్దాం.

–కవిటి

ప్రమాదకర ప్రయాణం..

జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాల్లో కొన్ని ప్రమాద స్థితిలో ఉంటున్నాయి. వాటి సామర్థ్యానికి మించిన ఎత్తులో వివిధ సరుకుల లోడ్లు వేయడం, అవి కూడా పక్కకు ఒరిగిపోయే స్థితిలో ఉండటంతో ఎక్కడ పడిపోతుందో, ఆ మూటలు పక్కనుంచి వెళుతున్న వాహనదారులుపై పడితే పెనుప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కంచిలి మండల పరిధిలో జాతీయ రహదారిపై ఇలాంటి ప్రమాదకర వాహనాలు తారసపడుతున్నాయి. పోలీసులు, హైవే సిబ్బంది ఇలాంటి వాహనాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

–కంచిలి



విశ్రాంత ఉద్యోగుల వినతి..



ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీనియర్ సిటిజన్లకు వైద్య సేవలు అందజేసే విషయంలో వెసులుబాటు కల్పించాలని టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆసుపత్రికి వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే వారికి సులభతరంగా వైద్య సేవలు అందజేయాలని, రిజిస్ట్రేషన్ విషయంలో సహాయక సిబ్బందితో సేవలు అందజేయాలని, మందుల వినియోగం విషయంలో తగినంత సూచనలు అందజేసే విధంగా కేంద్ర ప్రభుత్వ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్య సేవలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

–టెక్కలి